నిర్వహణ లేక నిరుపయోగం..

- శిథిలావస్థలో వైకుంఠధామాలు
- అంత్యక్రియలకు ఇబ్బందులు
- కొన్ని చోట్ల ప్రారంభించని వైనం
- వానాకాలంలో మరింత ఇబ్బందులు



వెల్గొండలో ప్రారంభం కాని శ్మశానవాటిక

బుగ్గారం: గ్రామాలు, పట్టణాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా నిధులు కేటాయించి పల్లెలు, పట్టణాల్లో అనేక సౌకర్యాలు కల్పించింది. దీనిలో భాగంగా శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, ఇంకుడుగుంతలు, నీటి కుంటలు, పశువుల పాకలు, ఎల్ఈడీ లైట్లు, పాఠశాలలో కిచెన్ షెడ్లు, వివిధ రకాల భవనాలు సహా అనేక రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు.

నిర్వహణలో నిర్లక్ష్యం..

గ్రామంలో ఎవరైనా చనిపోయినప్పుడు అంత్యక్రియలు నిర్వహించడానికి ఏ కాలంలోనైనా ఇబ్బందులు ఉండొద్దని శ్మశానవాటికలు నిర్మించారు. వీటిలో నీటి సౌకర్యం,విద్యుత్ సౌకర్యం, స్నానాల గదులు వగైరా నిర్మించారు. దీంతో అంత్యక్రియలు నిర్వహించడానికి గతంలో ఇబ్బందులు పడ్డ స్థానికులకు వీటి నిర్మాణంతో ఇబ్బందులు తీరాయి. అయితే వీటి నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామాల్లో ఎవరైనా చనిపోయినప్పుడు మళ్లీ గతంలో ఉపయోగించిన స్థలాల్లోనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎండాకాలంలో నీటి సౌకర్యం లేని చోట్ల స్నానాలకు ఇబ్బంది పడుతుండగా వానాకాలంలో దహనక్రియలు చేయడం ఇబ్బందికరంగా మారింది.

ప్రారంభమే కాని వైకుంఠధామం

మండలంలోని వెల్గొండలో నిర్మించిన శ్మశాన వాటిక ఇప్పటికీ ప్రారంభం కాలేదు. వైకుంఠ ధామం నిర్మాణ స్థలంపై కోర్టులో కేసు నమోదు కావడంతో ప్రారంభం కాలేదని ఎంపీడీవో అఫ్జల్‌మియా తెలిపారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే సిరికొండలో గల శ్మశానవాటికలో షెడ్డుపై రేకులు తొలగిపోయాయి. ఊరికి చాలాదూరంగా ఉండడంతో విద్యుత్ సౌకర్యం కల్పించడం ఇబ్బందిగా మారింది. అలాగే మరికొన్ని శ్మశానవాటికల్లో బోర్లు చెడిపోవడంతో పాటూ విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో వీటి వినియోగంపై ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



శ్మశానవాటికల నిర్వహణ సరిగా లేకపోవడంతో వాటిల్లో దహన సంస్కారాలు నిర్వహించడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.ప్రస్తుతం వర్షాకాలం కావున వైకుంఠధామాల్లో సౌకర్యాలను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలి. –నసీరుద్దీన్, వెల్గొండ

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఇబ్బందులున్న వైకుంఠధామాల్లో అవసరమైన మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.నీటి సమస్య ఉన్న చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. – అఫ్జల్‌మియా,ఎంపీడీవో బుగ్గారం



జగిత్యాలటౌన్: మురుగు నీటితో పాటు వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మించిన నాలాలను చిరు వ్యాపారులు, దుకాణదారులు మూసివేస్తుండటంతో వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దోమలు వస్తున్నాయంటూ కొందరు చిరు వ్యాపారులు డ్రెయినేజీలను మూసి వేస్తుండగా, ఇల్లు, షాపుల ముందున్న డ్రెయినేజీలపై పైకప్పులు, స్లాబులు వేయడంతో డ్రెయినేజీలు నిరుపయోగంగా మారి మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి డ్రెయినేజీలపైకప్పులు తొలగింపజేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
స్పందన, బల్దియా కమిషనర్, జగిత్యాల, సెల్ నంబర్: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నాలాలో సిల్ట్ తీస్తున్న మున్సిపల్ కార్మికులు

జగిత్యాల: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. శనివారం పెద్ద నాలాను మున్సిపల్ కార్మికులు సిల్ట్ తీసి శుభ్రం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్లు డ్రెయినేజీల్లో వేయకూడదని, దీంట్లో నీరు నిల్వ ఉండటంతో పాటు ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు శుభ్రమైన ఆహారం అందించాలి

చిరు వ్యాపారులు ప్రజలకు శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. శనివారం పాతబస్టాండ్‌లో చిరువ్యాపారులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఆహార పదార్థాలు విక్రయించినప్పుడు నాణ్యతతో కూడిన వాటితో పాటు, పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో ఏవో శ్రీనివాస్, డీఎంసీ సునీత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



స్టాల్స్‌లో విక్రయిస్తున్న మహిళలు

కోరుట్లటౌన్: పట్టణంలోని పాత మున్సిపల్ భవనంలో వీధి ఆహార ఉత్సవం పేరిట మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాలు శనివారం సంయుక్తంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళా నిర్వాహకులు తయారు చేసిన పిండి వంటకాలు స్టాల్స్‌లో విక్రయించారు. మున్సిపల్ అధికారులు మహిళలను అభినందించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

పట్టణంలోని 3 వార్డుల్లో మహిళా సంఘాల సభ్యులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. బట్ట సంచులు మాత్రమే వాడాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త వేరు చే సి, మున్సిపల్ వాహనాలకు అందించేందుకు సహకరించాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, మెప్మా టీఎంసి శ్రీరామ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిండి వంటకాలతో ఆర్థికంగా ఎదగాలి



ఫుడ్‌ఫెస్టివల్ ప్రారంభిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో అమృత్ 2.0 వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను బల్దియా కమిషనర్ మనోహర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిండి వంటకాల తయారీతో మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీఎంసీ శరణ్య, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న అక్రమాలిక్

జగిత్యాల: ప్రైవేట్ విద్యాసంస్థల్లో దోపిడీని అరికట్టేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ అన్నారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో మార్కెట్‌లో రూ.200 కు దొరికే పుస్తకాన్ని రూ.600కు విక్రయిస్తున్నారని, కొందరు పాఠశాలలు తమకు అనుకూలంగా ముద్రించిన నోట్స్, వర్క్‌బుక్స్ పేరుతో వేలాది రూపాయల డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులపై అధిక భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సమీర్, సంజయ్ పాల్గొన్నారు.

యోగా డే వేడుకలు



సంగెంలో యోగా చేస్తున్న గ్రామస్తులు



జైలులో యోగాసనాలు వేస్తున్న ఖైదీలు, సిబ్బంది



యోగా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



జగిత్యాలలో విద్యార్థినుల యోగాసనాలు



రాయకల్‌లో..

జగిత్యాల/జగిత్యాలరూరల్/జగిత్యాలజోన్/కోరుట్ల/కోరుట్లటౌన్/కోరుట్లరూరల్/ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్/మల్లాపూర్/మల్యాల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా యోగా డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలలు, అధికార కార్యాలయాలు, గ్రామాలు, మండల కేంద్రాల్లో యోగాసనాలు వేశారు. ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం చేయించారు. యోగా గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని, నిజజీవితంలో వాటిని ఎలా అలవర్చుకోవాలో అంశాలను వివరించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జగిత్యాల: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు గుర్రం కిరణ్ అన్నారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఈ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. 600 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, స్టేషన్ మేనేజర్ రవీందర్, కోట కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దామెర జయలక్ష్మి చారిట్రబుల్ ట్రస్ట్ రాం సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఇన్సురెన్స్ సీనియర్ సేల్స్ మేనేజర్ ముత్యపు రమేశ్ హాస్పిటల్ మేనేజర్ గజ వెల్లి గణేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన చిందు యక్షగానం



దేవస్థానంలో యక్ష గానం చేస్తున్న కళాకారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై శనివారం నిర్వహించిన చిందు యక్షగానం భక్తులను ఆకట్టుకుంది. పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్‌కు చెందిన గడ్డం చంద్రయ్య బృందం ఆధ్వర్యంలో ధర్మాంగధ చరిత్ర యక్షగానం చేశారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో వారికి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

జగిత్యాలటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అర్హులైన వారు ఇల్లు కట్టుకోవడానికి ఎదురు చూస్తున్నారని, అందులో అర్హులైన వారిని ఎంపిక చేసి రూ.5 లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించి నిజమైన నిలుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా షేక్ ఇర్ఫాన్

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామ ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా షేక్ ఇర్ఫాన్ ఎన్నికైనట్లు సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. కోశాధికారిగా ఎం.డీ చాంద్ పాషా, కార్యవర్గసభ్యులుగా షేక్ షబ్బీర్, ఎం.డీ లతీఫ్, ఎం.డీ హైమద్, షేక్ రసూల్ ఎన్నికయ్యారు. వీరిని సంఘం సభ్యులు అభినందించారు.

నిరుపేద మహిళకు ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన గుగులోత్ కాంతి అనే మహిళకు వైద్యం కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ. 2.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన పంచంగి రాజిరెడ్డి అనే రైతుకు చెందిన మూడు గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. శనివారం మేత కోసం వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారంగాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ సింధూశర్మ, ఏఈ ప్రవీణ్ తెలిపారు.

రాయికల్: పట్టణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నవీన్ శనివారం తెలిపారు.

ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం..?

జగిత్యాలక్రైం:జిల్లాలో రెండురోజుల క్రితం 8 మంది ఎస్సైలు బదిలీ అయిన విషయం తెల్సిందే. మరో నలుగురైదుగురిని బదిలీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఆయా పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్ కోసం ఎస్సైలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందించినట్లు తెల్సింది. వారిని నేడోరేపో బదిలీ చేయనున్నట్లు సమాచారం.

రోడ్లను అభివృద్ధి చేయాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, ముఖ్యంగా తహసీల్ చౌరస్తా నుంచి టవర్, గంజ్‌రోడ్, యావర్‌రోడ్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందల కోట్లు పెట్టి అభివృద్ధి చేస్తున్నా మౌలిక వసతులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. 24 ఏళ్ల క్రితం వేసిన రోడ్లే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయని, ఇప్పటికైనా నూతన రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటే మాస్టర్‌కు సత్కారం



వెంకటేశ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

జగిత్యాల: కుంగ్‌ఫూలో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు వారిని కరాటేలో శిక్షణ ఇస్తూ విద్యార్థులకు ఎంతో తోడ్పడుతున్న కరాటే మాస్టర్ వెంకటేశ్వర్లును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. చిన్నారులందరికీ కరాటే నేర్పించాలని సూచించారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు



విద్యార్థిని నృత్య ప్రదర్శన

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



రాయికల్: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రాత్రుల పూట వెలగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్దియాలోని ప్రధాన కూడలి అయిన గాంధీచౌక్ వద్ద మండలంలోని సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలకు ప్రధాన కూడలిగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జయశంకర్ సార్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

మెట్‌పల్లి/మల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మెట్‌పల్లి కొత్త బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి, నివాళి అర్పించారు. మల్లాపూర్ మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొండ మురళీ, ఇంద్రాల ఈశ్వర్, ఎదులాపురం కుమార్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మద్దెనపెల్లి శ్రీనివాస్, దొంతి సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

బాలసదనంలో దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న న్యాయ సేవా సంస్థ సభ్యులు

జగిత్యాలక్రైం: పట్టణంలోని బాలసదనంలో చిన్నారులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం న్యాయ సేవా సంస్థ సభ్యులు బాలసదనంలో వసతులను పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటశాల, స్టోర్‌రూమ్‌లలో పరిశుభ్రతను తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దోమల బెడద వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ, జిల్లా న్యాయ సేవ సంస్థ సెక్రటరీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ మాట్లాడుతూ పిల్లలకు మానసిక ప్రోత్సాహం కలిగిస్తూ బాల్యం నుంచే మంచి నడవడిక అలవర్చుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నరేశ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ప్రగతి విద్యార్థులు

రాయికల్: పట్టణంలో ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం ఇటిక్యాలలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధుల సమస్యలను తెలుసుకుని వృద్ధులకు భోజనంతో పాటు, బ్రెడ్, పండ్లు, వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలె శేఖర్, డైరెక్టర్ బాలె నిఖిల్, ఉపాధ్యాయులు స్వామి, గోపాల్‌రెడ్డి, రమ్య, సునీత పాల్గొన్నారు.

పాఠశాలకు కలర్ ప్రింటర్ బహూకరణ

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ముంబాయి నార్త్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం కలర్ ప్రింటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆనంద్, అప్కో చైర్మన్ కాసోజీ లక్ష్మీ, వీడీసీ చైర్మన్ ఆడెపు గణేష్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులన్నింటినీ భూభారతిలో నమోదు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, దీనిలో భాగంగా మండలంలో 2246 దరఖాస్తులు స్వీకరించామని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. త్వరలోనే దరఖాస్తులన్నింటినీ పరిష్కరించి భూభారతిలో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్ఐ భూమయ్య, శంషోద్దీన్ పాల్గొన్నారు.

భూ భారతి సదస్సుల్లో 941 దరఖాస్తులు

కథలాపూర్: మండలంలోని 19 గ్రామాల్లో భూ భారతి చట్టంపై గ్రామసభలు నిర్వహించగా, వివిధ సమస్యలపై 941 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వినోద్ శనివారం తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామంలో భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించామన్నారు.